అపారిశుద్ధ్యం నిర్మూలనకు కృషి : మున్సిపల్ కమిషనర్ రామారావు

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అపారిశుధ్యం నిర్మూల నకు కృషి చేస్తున్నట్లు మున్సివల్ కమిషనర్ నడిపెన రామారావు అన్నారు. గురువారం 24 వార్డు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, 18 వార్డు లేబర్ కాలనీ వద్ద కాలువ లోని పూడిక తీత, కాశీబుగ్గ అన్నా క్యాంటీన్ వద్ద పారిశుధ్య నిర్వహణ, 18 వార్డు తిలక్ నగర్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను కమిషనర్ నడిపేన రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస ప్రభుత్వ ఆసుపత్రి కి అధిక సంఖ్యలో ప్రజలు వస్తు పోతుంటారని ఆ పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి రోజు పరిసర ప్రాంతాలలో స్ప్రే మరియు బ్లీచింగ్‌తో శుభ్రంగా చేయాలని పారిశుద్ధ్య కార్మికులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్స్ మరియు సూపర్వైజర్ పాల్గొన్నారు.

ప్లాట్లు కేటాయింపులో గందరగోళం

- ఎం.ఐ.జె లేవుట్‌లో అన్ లైన్ డ్రా వాయిదా
- ఆందోళన చేపట్టిన లబ్ధిదారులు
- సుడా అధికారుల వైఫల్యం
- అధికారులు, ప్రజాప్రతినిధులు అసహనం
- సుడా అధికారులు తీరుపై ఎమ్మెల్యే శిరీష అసంతృప్తి
- లక్కీడ్రా పక్రియ వాయిదా : జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర - పలాస : పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 150 ఎకరాలలో వేసిన ఎంఐజి లేఅవుట్లో ఫేజ్ వన్‌కు సంబంధించి ప్లాట్లు కేటాయింపులో గందరగోళం చోటు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోనే ప్రతిష్టాత్మకంగా వేసిన ఒకే ఒక్క ఈఎంఐజి లేవుట్‌లో ప్లాట్‌ల విక్రయం ఆన్ లైన్ లో ప్రభుత్వం నిర్వహించింది. ఉత్సాహవంతులైన ఔత్సాహికులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వంలో సుడా అధికారులు లేఅవుట్ ప్రాంతంలో గురువారం ప్లాట్ ల కేటాయింపులకు లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించారు. అన్లైన్ డ్రా విదానంలో లబ్దిదారులు పేరులు చెప్పకుండా ధరఖాస్తు నెంబరు చెప్పడం సరిగా లేకపోవడంతో లబ్దిదారులు అధికారులు, ప్రజా ప్రతినిధులకు నిలదీయడంతో ఈ పక్రియ గందరగోళంగా మారింది. అంతకు ముందు ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ఈ లేవుట్ అన్ని వసతులతో నయా పలాసగా మారనుందన్నారు. సుడా అధికారులు తీరు సక్రమంగా లేదని, పంపిణీ ఏర్పాట్లు, డ్రా విదానం కూడా సక్రమంగా లేదని అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులకు కేటాయించిన పది శాతం రిజర్వేషన్ పై ఉద్యోగులు కూడా తీవ్రస్థాయిలో సభా వేదిక ముందుకు వచ్చి పక్రియ సక్రమంగా లేదని పదే పదే చెప్పడంతో దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ స్పందించారు. ఈ పక్రియలో కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని నేడు జరిగిన డ్రా పక్రియను రద్దు చేస్తూ మరోమారు కొత్తగా డ్రా వేయడం జరుగుతుందని స్పష్టం చేసారు. అదే విదంగా నేడు ధరఖాస్తు చేసుకున్న వారికి డ్రాలో ప్లాట్ రాకపోయినా నిరాశ చెందాల్సిన అవసరం లేదని షేజ్ 2లో వారికి అవకాశం కల్పిస్తామని హామి ఇచ్చారు. వాస్తవానికి ఫేజ్ వన్ లోని 50 ఎకరాలలో ముందుగా 250 ప్లాట్లుకు సంబంధించి అన్ లైన్ ద్వారా పక్రియ ప్రారంభించి వీటి విధి విదానాలకు అధికారులు లబ్దిదారులకు తెలిపారు. ప్లాట్లు కన్నా ఎక్కువ ధరఖాస్తులు వచ్చాయి. కొన్ని విభాగాలకు ఎక్కువ, కొన్ని విభాగాలకు తక్కువ ధరఖాస్తులు రావడంతో అన్లైన్ ద్వారా లక్కి డ్రా తీయడం జరుగుతుందని అధికారులు తెలపడంతో దీనిపై ప్రారంభంలోనే లబ్దిదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఉన్న ప్లాట్లుకు తగ్గ ధరఖాస్తులు తీసుకొని వాటిలో డ్రా తీయవలసి ఉండగా ఎక్కువ ధరఖాస్తులు ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. మూడు రకాల ప్లాట్లు వివిద లబ్దిదారుల కేటాయింపులో ప్రతీ అంశం వివాదస్పదంగా మారడంపై లబ్దిదారులు అసంతృప్తి చెందారు. అంతే కాకుండా సుడా అధికారులు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. స్క్రీన్ పై లబ్దిదారులు పేర్లు, ప్లాట్ నెంబర్లు కనిపించకపోవడంతో అధికారులు ప్లాట్ నెంబర్లు మైక్ లో చెబుతూ లబ్దిదారులు పేరు చెప్పకపోవడంతో మరింత గందరగోళంగా మారింది. ఏది ఏమైనా లబ్దిదారులకు సాఫీగా అందాల్సిన ప్లాట్లు గందరగోళంగా మారడంతో వారు మరింత ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఈ పక్రియను జెసి వాయిదా వేయడంతో లబ్దిదారులు నిరాశతో వెనుతిరిగారు. సుడా అధికారులు తీరుపై సుడా చైర్మన్ కొరికాన రవిశంకర్ అసంతృప్తి వ్యక్తం చేసి మరో మారు ఇలా జరగకుండా చూసుకుంటామని ఎమ్మెల్యే శిరీషకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ ఇఇ సుగుణాకరరావు, ఆర్డీఓ జి.వెంకటేష్, తహాశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, టిడిపి నాయకులు పి.విఠల్, లొడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, గాలి క్రిష్ణారావు, అంబటి క్రిష్ణమూర్తి, చంద్రశేఖర్ త్యాడీ, మల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - మందస : ఆంగ్ల సంవత్సరాదిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తనకు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పూల బొకేలు తీసుకురావద్దని నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అలా జనవరి ఒకటో తేదీన సేకరించిన నోట్ పుస్తకాలు పెన్నులను గురువారం రాష్ట్ర విద్యా మరియు ఐ టీ శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మందసలో మరియు బి వై ఆర్ పురం ఎంపీ యూపీ స్కూల్ లలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు భావన దుర్యోధన చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తమరి భాస్కరరావు, డొంకూరు తిరుపతిరావు, రట్టి లింగరాజు రాజాన మహేష్, ముడుముంచి నవీన్ కుమార్,గువ్వాడ లక్ష్మీనారాయణ, ముంజేటి చంద్రశేఖర్, దెబాసిస్ పండా, ప్రకాష్ పాణిగ్రహి, గార కృష్ణారావు, బురగాపు శంకర్, బర్ల హరికృష్ణ, తేళ్లి.హరికృష్ణ, కొర్నాన మురళి, నాగేశ్వరరావు దుంకూరు బాలకృష్ణ, సారి.డిల్లేశ్వరరావు, రత్నాల వరప్రసాద్, మంగల పాత్రో, మామిడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : పశు సంపదను పెంపొందించుకోవాలని పలాస ఎంఎల్‌ఏ గౌతు శిరీష అన్నారు.గురువారం పల్లిసారదిలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ప్రతీ పశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఆరోగ్య శిబిరాలు ఉపయోగ పడతాయని అన్నారు. ఉచిత చికిత్సతో పాటు మందులు అందజేస్తారని తెలిపారు. ఆరోగ్యకరమైన పశువులు తో పాడి రైతులు కు లాభం చేకూరుతుంది అన్నారు. పశువులు కోసం గోకులం షెడ్ లను ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. ఈ సందర్భంగా పశు సంవార్ధక శేఖ పోస్టర్‌ను విడుదల చేసారు. నట్టాల నివారణ, గర్భ కోస వ్యాధులు, కార్యక్రమంలో పశు శాఖ సహాయ సంచాలకులు మట్ట రవికృష్ణ,రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, టిడిపి సీనియర్ నాయకులు పి.విఠల్, మండల టిడిపి అధ్యక్షులు సురాడ మోహనరావు, మాజీ సర్పంచ్ పోతనపల్లి షణ్ముఖ రావు, మండల పశు వైద్యాధికారి మెట్ట పాపారావు, ఉప్పరపల్లి తిరుపతి రావు, దున్న యయాతి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడపలో అదరగొట్టిన తప్పెటగుళ్ళు కళాకారుల ప్రదర్శన

విశాలాంధ్ర - పలాస : కడప జిల్లాలో ఇటీవల జరిగిన శ్రీరామ మహా శోభ యాత్రలో శ్రీకాకుళం జానపద గుండెచప్పుడు తప్పెటగుళ్ళు కళారూపంతో వెళ్లిన కళాకారులు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. మెలియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన పాలిన శంకర్ బృందం చేసిన తప్పెటగుళ్ళు ప్రదర్శన భక్తులను, జిల్లా ప్రజలను విశేషంగా ఆకర్షించింది. అద్భుతమైన లయ విన్యాసాలతో పల్లె జానపదాలతో శ్రీరాముని చరిత్రను పాడుతూ అందరిని భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అతిధులు నిర్వహణ కమిటీ సభ్యులు కళాకారులను ఆశీర్వదిస్తూ శ్రీకాకుళం జిల్లాలో దమ్మున్న కళారూపం హృదయాలను కదిలించే ప్రాచీన జానపదం తప్పెటగుళ్లని ఈ కళా రూపాన్ని ముందు తరాలకు అందించి సజీవంగా నిలవాలని పాల్గొన్న కళాకారులందరినీ సత్కరించి గౌరవ మర్యాదలతో సన్మాన సత్కారాలతో పంపించడం ఒక మరుపురాని అనుభూతిని కళాకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పాలిన శంకర్ ముడిమించి రమేష్ హరికృష్ణ దొరబాబు బన్నీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ఆదేశాల మేరకు విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - జలుమూరు : రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూచనల మేరకు జలుమూరు మండలం చల్లవానిపేట విద్య సంస్థల ప్రాంగణంలో గురువారం విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నరసన్నపేట నియోజకవర్గ ఇన్చార్జ్ మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ కరపత్రాల్లో ఉన్న ప్రతి పదజాలం చదవాలని విద్యార్థులకు సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హెూం శఖ మంత్రి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ త్రీవ ఆందోళన చెందుతుంది. దేశానికి కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను కొనియాడారు. మామిడి సత్యనారాయణ తో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బేరి వెంకటరమణ, పలువురు పాల్గొన్నారు.

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు కవిటి సర్పంచ్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు కు జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరగబోయే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందినట్లు సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. దేశ రాజదాని న్యూ ఢిల్లీ లో 26 వ తేదీన జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పత్యేక అతిధిగా పాల్గొనే అరుదైన అవకాశం లభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కమిషనర్ రూరల్ డెవలప్మెంట్ శాఖ కార్యాలయం నుండి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి విశేష కృషి చేసిన వారికి జిల్లాకు ఒకరు చొప్పున కవిటి మండలం నుండి తనకు ఆహ్వానం అయినట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సద్వినియోగం, పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగునీటి సదుపాయాలు కల్పన తదితర అంశాల ప్రాతిపదికగా తీసుకొని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో జరగబోయే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథిగా పాల్గొనే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. గణతంత్ర వేడుకల్లో మాట్లాడే అవకాశం వస్తే స్థానిక సంస్థల బలోపేతం ఆవశ్యకత గురించి తెలియజేస్తానని తెలిపారు.

నేడు సోంపేటలో బీఎస్పీ సమావేశం

విశాలాంధ్ర - సోంపేట : ఇచ్ఛాపురం నియోజకవర్గం బిఎస్పి (భారతీయ సమాజ్ వాది పార్టీ) విస్తృతస్థాయి సమావేశం శుక్రవా రం 9 గంటలకు సోంపేటలో గల ఆం అండ్‌బి గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేత వేదవర బిసాయి తెలిపారు. ముఖ్య అతిథిగా ఉత్త రాంధ్ర బిఎస్పి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే లఖే రాజా రావు హాజరు కానున్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రెల్లివలస, పారశిల్లి గ్రామాలను దత్తత తీసుకుంటాను

రూ.3.20 కోట్లతో రెల్లివలస రహదారికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలో రెల్లివలస, పారశిల్లి గ్రామాలను అభివృద్ధి చేయటంలో భాగంగా దత్తత తీసుకుంటానని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని పారశిల్లి-రెల్లివలస-అల్లాడ గ్రామాలకు సుమారు రూ.3.20 ఉపాధి హామీ నిధులతో బి.టి రహదారి నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేశారు. పారశిల్లి పంచాయితీ సర్పంచ్, డబ్బీరు కిరణ్ చంద్ పట్నాయిక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ పారశిల్లి-రెల్లివలస-అల్లాడ గ్రామాల మధ్య బి.టి.రహదారి నిర్మించటం నా కల అని, వచ్చే మార్చి నెలాఖరు నాటికి రహదారి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్‌కు, ఆర్అండ్‌బి అధికారులకు రైతులు సహకరించాలని, బి.టి రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత భూముల విలువ పెరుగుతుందన్నారు. సమస్యలు లేని నియోజకవర్గంగా నరసన్నపేటను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, కష్టకాలంలో యువకులైన డబ్బీరు సోదరులను పార్టీలో చేర్పించారని, వారు కూడా గ్రామపెద్దలను గౌరవిస్తూ, పంచాయితీలో ప్రజలకు అందుబాటులో ఉండే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ సంధర్భంగా యువ నాయకులు, లోకేష్ పుట్టిన రోజు సంధర్భంగా ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి కేక్‌ను కట్ చేశారు. అనంతరం డబ్బీరు సోదరులైన కిషోర్ చంద్ పట్నాయిక్, కిరణ్ చంద్ పట్నాయిక్, కరణ్ చంద్ పట్నాయిక్ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తికి పుష్పగుచ్ఛాన్ని అందచేసి, ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వైస్ సర్పంచ్, గొండు మధు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్, భైరి రామారావు, టిడిపి నాయకులు, గంగు చలపతిరావు, దుద్దు రాజేశ్వరరావు, మెండ రాంబాబు, సూరపు నారాయణదాసు, భైరి భాస్కరరావు, మాదిన నల్లాన వెంకట శాస్త్రి, అట్టాడ వెంకటకృష్ణ, అడపా చంద్రశేఖర్, పూతి రమణ, గొద్దు చిట్టిబాబు, పిల్లల చంద్రరావు, లొట్ల భాస్కరరావు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

ధర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : బూర్జ మండలాల పరిధిలో క్రిటికల్ ధర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు గురు వారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలో ఇంజనీర్ల కమిటీ బృందం స్థల పరిశీలన చేశారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో భూ పరిస్థితులను, వాతావరణ అను కూలతలను అధ్యయనం చేయటానికి ఈ కమిటీ పర్యటించారు. యువతకు ఉపాధి అవకాశాలు కలగాలంటే పరిశ్రమలు రావాలని ఎమ్మెల్యే అన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే నాణ్యమైన విద్యుత్ అందించాలని, అందుకే విద్యుత్ తయారీకి అనువైన ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తు న్నట్లు తెలిపారు. విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రామాల ప్రజలు కూడా సహ కరించాలని తెలిపారు. అందరి సహకారంతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యపడు తుందన్నారు. ఈ పరిశీలనలో టీడీపీ సీనియర్ నాయకులు శివ్వాల సూర్యం, మార్కుఫెడ్ స్టేట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు అంబాల రాంబాబు, ఎలక్ట్రికల్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్ కేలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - సోంపేట : సోంపేటలో గల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో గురువారం కేలండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ కార్యాచరణ మేరకు కేలండర్ ఆవిష్కరణ నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఏడీఈ రవికుమార్, రామారావు, వీఆర్వో రామ్మోహన్, మధుసూదన్, మీటర్ రీడర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దూగాన భాస్కర్, ఆనంద్, సంతోష్ పండా, పూడి సంతోష్, వలసయ్య, దుర్యోధన, హరి తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ శిక్షణకు ఆసక్తి చూపుతున్న యువత

విశాలాంధ్ర - హిరమండలం : స్కిల్ డెవలప్మెంట్ పిఎం ఇంటర్నషిప్ శిక్షణకు యువతి యువకులు చాలా ఆసక్తి చూపుతున్నారని ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో పిఎం ఇంటర్నెషిప్‌కు మండలంలోని 21 నుంచి 24 సంత్సరాల వయసు లోపు చదువుకున్న యువతి యువకుల 50 కంపెనీ ల్లో ఉద్యోగాలు కోసం రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ ఇలా చదువు కున్న వారందరికీ ఒక ఏడాది పాటు శిక్షణ ఇచ్చి శిక్షణ కాలంలో 5 వేలు రూపాయలు స్టైపండ్ గా ఇవ్వడం జరుగుతుందని, ఆపై శిక్షణ పొందిన వారికి 50 రకాల ఫ్యాక్టరీ లలో ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందని, రెండు రోజులు రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో స్కిల్ డెవలప్మెంట్ కో ఆర్డినేటర్ వై మీరా బాయ్, డిజిటల్ అసిస్టెంట్‌లు, యూవకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు త్వరితగతన పరిష్కరించాలి

తహాశీల్దార్ బెహరా మురళీమోహనరావు

విశాలాంధ్ర - కవిటీ : భూ సమస్యలు త్వరితగతన పరిష్కరించాలని తహసిల్దార్ బెహరా మురళీ మోహన రావు సూచించారు. ఈ మేరకు గురువారం తాసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేర్ లతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 రెవెన్యూ గ్రామలో జరిగిన రెవెన్యూ సదస్సులలో 1036 భూ సమస్యలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు.అందులో 776 రీ సర్వేకు సంబంధించిన ఫిర్యాదులు,260 రెవెన్యూ సదస్సులకు సంబంధించిన ఫిర్యాదులు అందాయని తెలిపారు. సోమవారం వరకు 94 పరిష్క రించామని ఇంకా 942 ఫిర్యాదులు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. త్వరితిగతిగా భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రహి, ఆర్ఐ రమణమూర్తి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు చేరిన న్యాక్ బృందం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కాలేజ్)ను నేషనల్ అక్రిడేషన్ కమిటీ (న్యాక్) బృందం గురువారం పరిశీలించింది. బెంగళూరుకు చెందిన న్యాక్ కమిటీ సభ్యులు కళాశాలలోని వివిధ విభాగాలను, కళాశాల మైదానాన్ని, భవనాలను పరిశీలించారు. ఎంతో ప్రతిష్ట ఉన్న ఆర్ట్స్ కళాశాల అభివృద్ధి చెందాలంటే మరికొన్ని అదనపు భవనాలు కేటాయించాలని, ఆధునిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కమిటీ సభ్యులకు సూచించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. ఆర్ట్స్ కళాశాల నాటి నుంచి నేటివరకు అభివృద్ధి చెందిన తీరుతెన్నులను తన హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సురేఖ నేక్ బృందానికి వివరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, రిటైర్డ్ జెడ్పి సీఈవో, విద్యావేత్త సురంగి మోహన్రావు, రిటైర్డ్ సెట్ సీఈవో వి.వి.ఎన్.మూర్తి, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి తంగి మురళీ పాల్గొన్నారు.

ఎదిగే కొద్ది ఒదిగిన వ్యక్తిత్వం 'లోకేష్' సొంతం

విశాలాంధ్ర - నరసన్నపేట : యువ నాయకులు, తెలుగుదేశం పార్టీ అశాజ్యోతి, చిరంజీవి నారా లోకేష్ ఎదిగే కొద్ది ఒదిగిన వ్యక్తిత్వంతో రాష్ట్ర ప్రజలు మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి, లోకేష్ 42వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి, కేక్ కట్ చేసి, పార్టీ ప్రతినిధులకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, ఎన్.టి.రామారావు మనవుడుగా, ప్రస్తుత రాష్ట్ర ముఖ్య మంత్రి, చంద్రబాబునాయుడు కుమారుడుగా లోకేష్ సహనం, పట్టుదల కల్గి, అతి చిన్న వయస్సులో రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అలాగే ఈ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయంటే తండ్రికి సహాయకారిగా దేశ, విదేశాల నుండి పెట్టుబడులు తెస్తున్నారని, యువగళం పేరుతో సుమారు 4వేలు కిలోమీటర్లు పాదయాత్ర చేసి, ప్రజల సమస్యలు తెలుసుకున్న జన నాయకుడని తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గ తరపున లోకేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, 20వ వార్డు మెంబర్, బతకల సంతోషి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్, రోణంకి కృష్ణం నాయుడు, టిడిపి ప్రతినిధులు శిమ్మ చంద్రశేఖర్, బలగ భారతి, పుచ్చల కల్పన, గుణుపురం రామలక్ష్మి, పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదానికి మూలం : ఎస్ఐ కృష్ణ ప్రసాద్

విశాలాంధ్ర - మందస : అతివేగం ప్రమాదానికి మూలమని ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మందస ఎస్సై కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం మందసలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనానికి సంబందించిన అన్ని రకాల పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సూచించారు. నిబంధనలకు భిన్నంగా రోడ్డు పై అధిక శబ్దంతో హారన్ మోగిస్తూ అతి వేగంగా వాహనాన్ని నడపవద్దని కోరారు.వాహన దారులు నిబంధనలకు భిన్నంగా వ్యవరిస్తే మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు. వాహనాలను అతివేగంగా నడిపి ప్రాణాలు పోగొట్టు కోవద్దని రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

జీడీకి గిట్టుబాటు ధర కల్పించాలి : కిసాన్ మహా సభ జిల్లా నాయకులు మద్దిల

విశాలాంధ్ర - పలాస : దేశంలోనే జీడిపప్పు పండించడంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని, ఎనిమిది జిల్లాల్లో 1.83 లక్షల ఎకరాల్లో జీడిపంట పండిస్తున్న రాష్ట్రంలో పలాస జీడిపప్పు అత్యంత గుర్తింపు పొందిందిన వ్యాపారస్తులు, దళారులు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా దోపిడీ చేస్తున్నారని సిపిఐ ఎమ్ఎల్ లిబరేషన్ , కిసాన్ మహా సభ జిల్లా నాయకులు మద్దిల రామారావు విమర్శించారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న జీడిపప్పు ద్వారా స్వదేశీ జీడి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి గింజలు దిగుమతులపై సుంకాన్ని విధించాలని, 80 కేజీల బస్తాకు కనీస మద్దతు ధర 16,000 ప్రకటించాలని. జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద బ్యాంకు రుణాలు అందజేయాలని.(ఆర్ బి కే) రైతు భరోసా కేంద్రం ద్వారా జీడీ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మద్దిల రామారావు డిమాండ్ చేశారు. వ్యాపారస్తులు రైతులతో పాటు శ్రామికుల శ్రమను కూడా దోచుకుంటున్నారనీ, జీడిపప్పు కాల్చి కొట్టి ప్రాసెస్ చేసే పనిలో కార్మికులకు ఎక్కువ ఉపాధి దొరికేదని, కార్మికులతో పనిలేకుండా అన్ని పనులు యంత్రమే చేయడంతో యాంత్రి కరణ వల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారస్తులు పలాస బ్రాండ్ సొమ్ము చేసు కుంటూ ధరలను నియంత్రిస్తున్నారని, ప్రభుత్వం ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తోందని మద్దిల ధ్వజమెత్తారు.ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకుతో సహా అనేక పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు బోర్డు లుండగా, అత్యంత డిమాండ్ కలిగిన పౌష్టికాహారం అందించే విదేశీ మారకద్రవ్యాన్నితెచ్చే జీడిపంటకు గిట్టుబాటు ధర నిర్ణయించడానికి ప్రభుత్వం బోర్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని? అఖిల భారత కిసాన్ మహా సభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు ప్రశ్నించారు. రైతుల కష్టం దళారుల బోజ్యంగా మారిందని, పంటకు గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వ చేసుకో వటానికి తగినన్ని గిడ్డంగులు నిర్మాణం చేయా లని కోరారు. మద్రాసు రాజధానిగా ఉన్నప్పుడే ఇచ్ఛాపురం నుండి తడ వరకు రైతాంగ సమస్యల సాధన కోసం పాదయాత్ర చేసి డిమాండ్స్ సాధించుకున్న ఘనత ఆంధ్ర రైతాంగానికి ఉందని గుర్తు చేశారు. ఉద్దాన ప్రాంతంలో మళ్ళీ విజృంబిస్తున్న కిడ్నీ సమస్య పరిష్కరించడానికి పలాస కిడ్నీ ఆసుపత్రిలో యాంత్రీకరణ చేపట్టాలని స్థానిక పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా స్పందించాలని రామారావు డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు : సీఐ తిరుపతిరావు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సీఐ తిరుపతిరావు అన్నారు. గురువారం మండలం గరుడభద్ర గ్రామంలో గ్రామస్తులు యువకులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ తిరుపతిరావు మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు బానిసలు అవ్వకుండా దూరంగా ఉండాలని అన్నారు. అలాగే మత్తు పదార్థాలకు బానిసలు అయితే జీవితం సర్వ నాశనం అయిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వజ్రపు కొత్తూరు ఎస్సై నిహార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు జలుమూరులో ఉల్లాస్ శిక్షణ : ఎంపీడీవో అప్పలనాయుడు

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రంలో జలుమూరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉల్లాస్ రెండవ దఫా శిక్షణ కార్యక్రమం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి అప్పలనాయుడు తెలిపారు. ఈ శిక్షణలో వాలంటరీస్ కు ప్రత్యేక అవగాహన ఉంటుందని తెలిపారు. సమాచారం తెలుసుకున్న ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది ఇతరులు పాల్గొని ఎంపీడీవో కోరారు.

గణతంత్ర వేడుకలకు బెజ్జిపురం యూత్ క్లబ్‌కి ఆహ్వానం

అరుదైన ఘనత సాధించిన ప్రసాదరావు మాస్టార్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : భారత గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి బెజ్జిపురం యూత్ క్లబ్ వ్యవస్థాపకులు మేడూరు ప్రసాదరావుకు ఆహ్వానం అందింది. గత ఏడాది నవంబర్‌లో ప్రధాని నరేంద్రమోడీ మనీ బాత్ కార్యక్రమంలో బెజ్జిపురం యూత్ క్లబ్ 43 ఏళ్లుగా మహిళా స్వయం ఉపాధి సాధికారిత కోసం చేస్తున్న కృషిని ప్రశంసించారు. బెజ్జిపురం యూత్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని, దేశమంతా ప్రతి గ్రామంలో స్వచ్ఛంద సంస్థలు స్ఫూర్తితో పనిచేయాలని మోడీ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న గణతంత్ర వేడుకలకు పాల్గొనే అవకాశాన్ని ఆల్ ఇండియా రేడియో తరపున మేడూరు ప్రసాదరావుకు లభించింది. తన కుమారుడు విజయ్ కిరణ్ తో కలిసి గురువారం ఢిల్లీ పయనమయ్యారు. రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనడంతో పాటు ప్రసారభారతి నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రసాదరావు మాస్టార్ పాల్గొంటారు.

ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించండి

పి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షులు మురళీమోహనరావు

విశాలాంధ్ర - నరసన్నపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎం.ఎల్.సిగా తంగి మురళీమోహనరావును గెలిపించండని పి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షులు, తంగి మురళీ మోహనరావు కోరారు. గురువారం మండలం లోని నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏ.పి.టి.ఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి, బి.వేంకటేశ్వరరావు హాజరై, మిత్ర సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా బలపరిచిన డా.గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించుకోవాల్సిన ఆవశ్యత ఉందని అన్నారు. అలాగే పిఈటీ, పిడి సంఘాల తరపున కె.గోపి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా శ్రీనివాసులునాయుడు గెలుపే ధ్యేయంగా పనిచేయాలని తెలిపారు. ఆర్.యు.పి.పి నుండి హాజరైన పి.వెంకటరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన కల్గివున్న శ్రీనివాసులునాయుడు మాత్రమే ఏకీకృత సర్వీసు రూల్స్‌ను అమలులోకి తీసుకురాగల సామర్థ్యం ఉన్న వ్యక్తి అని అన్నారు. పిఆర్‌టియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, పప్పల రాజశేఖర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ ఉపయోగకరమైన యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ సాధనే ఏకైక ధ్యేయంగా శ్రీనివాసులునాయుడు పనిచేస్తారని, అతనిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తెలిపారు. పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, దానేటి కేశవరావు మాట్లాడుతూ శ్రీనివాసులునాయుడు గెలుపు ఉపాధ్యాయ లోకానికి సేవే పరమావిధిగా పనిచేస్తారని అన్నారు. పిఆర్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు, బత్తుల రవికుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ఒక కార్యకర్తగా పనిచేసి, నాయుడు గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, చింతు వాసుదేవరావు, జి.సత్తిబాబు, పంగ అప్పలనాయుడు, పల్లి రమేష్, బి.వెంకటరమణ, బుద్ధల కేశవరావు, ఇప్పిలి వేణుగోపాలరావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రంగోత్సవ పోటీలకు కవిటి విద్యార్థులు

విశాలాంధ్ర - కవిటి : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ వారు 8 విభాగాల్లో నిర్వహించే రంగోత్సవ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం రాష్ట్ర స్థాయి పోటీలకు వెళుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వర రావు తెలిపారు. వీరు జనవరి 24వ తేదీన విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు .విద్యార్థులను ఉపాధ్యాయుడు పిబికె.శర్మ తీసుకువెళుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద జరిగిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకిరావు, వెంకటరావు, ప్రకాశరావు, వాసుదేవరావు, అరుణ కుమారి, రాధిక, నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ టి మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవటమే ప్రజాస్వామ్యానికి పునాది

విశాలాంధ్ర - నరసన్నపేట : 18సంవత్సరాలు పూర్తి అయిన ప్రతీ వ్యక్తీ ఓటరుగా నమోదై, తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవటమే ప్రజాస్వామ్యానికి పునాది అని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎం.లావణ్య అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్స్ పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఓటు ఫర్ ష్యూర్ అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, లావణ్య మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎం.సత్యన్నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత, వైస్ ప్రిన్సిపాల్, శాంతి హేమ్, అధ్యాపకులు, ఎం.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి, కె.సునీత, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, శరత్ ఉన్నారు.

కేజీబీవీలో సామాజిక తనిఖీ

విశాలాంధ్ర - హిరమండలం : గురువారం హిరమండలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఆర్ పి.జగన్, రాజులు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణ వేణి తెలిపారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థునిల తల్లి దండ్రులతో, విద్యార్థినిలతో మాటాడారు. విద్యార్థునిల విద్యా సామర్థ్యం ను పరిశీలించి చాలా సంతృప్తి చెందిన ఎస్ ఆర్ పి జగన్, కేజీబీవీకి సంబందించిన పలు రికార్డులను, ఆహార పదార్థాల నిల్వలను పరిశీలన చేశారు. హిరమండలం కేజీబీవీ విద్యార్థులు ప్రతీ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 10/10లు సాధించిట్రిపుల్ ఐటీ సీట్లు సాధిస్తూ వస్తున్నారని జిల్లా లో హిరమండలం కేజీబీవీ కి మంచి పేరు ఉందని ఎస్ ఆర్ పిఈ సందర్బంగా తెలియజేశారు. ఇంటర్మీడియట్ విద్యా ర్దులు కూడా చక్కగా చదువు కొని తల్లిదండ్రులకు, కళాశాల కు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తట్ల శంకర్ రావు, వైతవిటయ్య, ఉపాధ్యాయునిలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

19 సంవత్సరాలు నిండిన నీడను నోచుకోని 108

విశాలాంధ్ర - జలుమూరు : అత్యవసర సమయాల్లో ఆదుకోవాలని నాటి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస రాజశేఖర్ రెడ్డి 108 పథకాన్ని ఏర్పాటు చేశారు. మండలానికి ఒక వాహనం లెక్క పీటిని మంజూరు చేశారు. అత్యవసర చికిత్సల కోసం ప్రాణ నష్టం నివారణ కోసం ఎంతో ఉపయోగ పడుతున్న 108 సేవలు ఆ వాహనానికి నిలువ నీడ లేక అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు రెండు దశాబ్దాలు అవుతున్న ఆరు బయట ఎక్కడో వీధులంట ఇది నిలిచి ఉంటుంది. ఎంతో ప్రజలకి అవసరమైనటువంటి వాహనాన్ని కనీసం ప్రత్యేక శ్రద్ధ ఏర్పాటు చేయకపోవడం అనేక విమర్శ వినిపిస్తున్నాయి. పాలకులు అధికారులు పరిశీలించి 108 వాహనానికి షెడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

యువశక్తి ఫౌండేషన్ సభ్యులు వితరణ

విశాలాంధ్ర - కవిటి : మండలంలో గల బి.గొనపపుట్టుగకు చెందిన బడగల చిన్నారావు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు ప్రతీ రోజు పెద్ద మొత్తంలో ఖర్చుఅవుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ గ్రామానికి చెందిన యువ శక్తి ఫౌండేషన్ సభ్యులు గురువారం ఆ కుటుంబానికి రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామపెద్దలు,యువశక్తి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతే.. జీవితానికి రక్షణ : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రహదారి పై డ్రైవింగ్ చేసే ప్రతీ ఒక్కరూ రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అవసరం ఉన్న చోట స్పీడ్ బ్రేకర్స్ సత్వరం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలు, జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 16 నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జిల్లాలో అనేక చోట్ల రోడ్డు భద్రతపై వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. జిల్లాలో ప్రధాన కూడళ్ళలో ఉన్న రవాణా సంబంధించిన రహదారులు, సర్వీస్ రోడ్లు, స్పీడ్ బ్రేకర్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. రోడ్డు భద్రతా చర్యలపై ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని, రోడ్డుపై మార్కింగ్, సైన్ బోర్డులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జాతీయ రహదారులలో ఉన్న సైన్ బోర్డులు పెద్ద అక్షరాలతో ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్.అండ్.బి, మున్సిపాలిటీ సమస్యలు ఉన్న రహదారుల గుర్తించి వాటిపై సత్వరం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, రాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరమని అన్నారు. కార్ డ్రైవింగ్ చేసేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణించరాదని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను వాహనంలో ఎక్కించుకుని, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడుపుట అత్యంత ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధారణ - ప్రాణానికి రక్ష అన్నారు. వివిధ స్కూళ్లలో,కాలేజీలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు సలహాలు ఇవ్వడంతో పాటు కంటి, ఆరోగ్య పరీక్షలు చేయించడం కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ విజయ సారధి, డిఎస్పి వివేకానందరావు, అదనపు ఎస్పి కె వెంకటరమణ, డీపీవో భారతి సౌజన్య, ఆర్అండ్బి ఎస్ఈ జాన్ సుధకర్, నేషనల్ హైవేస్ ఆధారిటి పిడి తీవారీ, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఓబీసీలు కలిస్తేనే రాజ్యాధికారం : కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు చింతామోహన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఎస్సీలు, ఓ బీసీలు కలిస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఓబిసి వ్యక్తిని సీఎం చేయడానికి పోరాడుతానని కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చింత మోహన్ అన్నారు. గురువారం స్థానిక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీలను ఉపకులాలుగా విభజించి వారిలో ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే శ్రీకాకుళం నుండి కర్నూలు వరకు ఉద్యమానికి ఊపిరి పోస్తానన్నారు. స్వతంత్రం వచ్చి 75 ఏళ్ళు అవుతున్న ఏపీలో ఇప్పటివరకు బీసీలు ముఖ్యమంత్రి కాలేదని రాష్ట్రంలో 50 శాతానికి పైగా బీసీలు ఉన్నారని ఎస్సీ, ఎస్టీలు సంఖ్య కూడా ఎక్కువ శాతమే ఉన్నప్పటికీ కేవలం కొద్దిమంది ఉన్న ఓసి కులాల వారే సీఎంలు అవుతున్నారన్నారు. నేను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు బీఎస్పీ అగ్రనేత కాన్షీ రామ్, ఎస్పీ అగ్రనేత ములాయిం సింగ్ నేతలను తన ఇంటికి బ్రేక్ ఫాస్ట్ కు ఆహ్వానించి ప్రెస్ క్లబ్ కు పంపి సంయుక్త సమావేశం నిర్వహించి ఆ తర్వాత ములాయిం సింగ్ యాదవ్ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలను ఏకీకృతం చేసిన తనకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు కేంద్ర పదవి నుంచి తప్పించారని, అయినా సామాజిక వర్గాలను కలిపాను అనే సంతృప్తి ఉందన్నారు. ఎస్సీ ల వర్గీకరణ పై చంద్రబాబు ప్రభుత్వం ఒక్క అంగుళం ముందుకు వెళ్లిన రాష్ట్రంలో ఉన్న ఎస్సీలను ఓబీసీలను కలుపుతానని రాజ్యాధికారం దిశగా వారిని తీసుకెళ్తానన్నారు. అవసరమైతే కాంగ్రెస్ అధిష్టానం ఆశీస్సులు కూడా అందుకుంటానని అన్నారు. అదే ప్రయత్నాన్ని శ్రీకాకుళం నుండి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఎస్సీల వర్గీకరణ జరిగితే యూపీలానే ఏపీ అవుతుందన్నారు. కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ నాటి కేంద్ర మంత్రి అర్జున్ సింగ్ కృషివలన విద్యా ఉద్యోగాలలో 27శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణ చేసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. ఐఐటి ఐఏఎం, ఎయిమ్స్ వంటి పెద్ద పెద్ద సంస్థల్లో కూడా 27శాతం రిజర్వేషన్లు రావలసిన ఓబీసీలు ఐదు శాతం మాత్రమే ఉన్నారన్నారు. సుప్రీం కోర్టుపై చంద్రబాబు ప్రభుత్వం వన్ మాన్ కమిషన్ వేయడం తప్పుగా భావిస్తున్నామన్నారు. మిశ్రా ఒంగోలు వచ్చారని ఆ సందర్భంలో కొట్లాటలు వంటి సంఘటనలు కూడా జరిగాయి అన్నారు. చంద్రబాబు తనకు మంచి మిత్రుడే అయినప్పటికీ ఆయన ఆలోచన విధానాన్ని ఖండించడం అనివార్యమన్నారు. మిశ్రా కమిషన్ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీలను, ఎస్టీలను, ఓబీసీలను కలిపి రాజ్యాధికారం సాధించడమే నా లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు.

రైతుకు లాభసాటి పాడి పరిశ్రమ : ఏడీ ఆనందరావు

విశాలాంధ్ర - ఆమదాలవలస : రైతులకు పాడి పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం చేకూ రుతుందని పశు సంవర్ధక శాఖ ఏడి డాక్టర్ ఆనంద్ రావు తెలిపారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా టీం వన్ అక్కుల పేట నుంచి కొం కోటలో, టీం టు కొత్తవలస నుంచి చేపన పేట పంచాయతీల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను లాభసాటిగా వ్యాపార సరళి లో నిర్వహించుటకు పశు సంవర్ధక శాఖ ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాలు విజయవంతంగా పశువైద్యాధికారులు నిర్వహిస్తు న్నారు. ఆమదాల వలస మండలం లోని కొర్లకోట గ్రామం లో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరం ను స్థానిక సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు ప్రారంభించారు. చేపన పేటలో సర్పంచ్ సేపెన సత్తి రాజు ప్రారంభించారు. రైతులకు అవసరమైన మందు లను పంపిణీ చేశారు.ఈ శిబిరం లో గర్భకోశ వ్యాధు లకు చికిత్సలు,సాధారణ పశువులకు చికిత్సలు,లేగ దూడ లకు ఏలిక పాముల నివారణ మందులు, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు,వ్యాధి నిరోధక టీకాలు మరి యు పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్యం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఓంకార్, డాక్టర్ ఎతిరాజుల హేమలత పశువులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పద్ధతులను ప్రభుత్వ విప్ అశోక్‌కు వివరించిన యూనిట్ ఇన్‌చార్జ్

విశాలాంధ్ర - కవిటి : ప్రకృతి వ్యవసాయం పద్ధతులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెండాలం అశోక్కు యూనిట్ ఇంచార్జ్ తులసయ్య వివరించారు.మండలంలోని సిలగాం పంచాయితీ జమేదారిపుట్టుగ గ్రామంలో ప్రభుత్వ విప్ డాక్టర్ బెండాళం అశోక్‌కు ప్రకృతి వ్యవసాయం పద్ధతులను యూనిట్ ఇన్చార్జ్ తలసయ్య వివరించారు. ఇప్పుడు ఉన్న ప్రధాన పంట నువ్వులతో పాటు అలసంధలు, మొక్కజొన్న, గోరుచిక్కుడు, మినుములు,గోంగూర పంటలను ఆర్‌డీఎస్ రైతులతో వేయిస్తున్నామని ఏక పంట కాకుండా బహుళ పంటల వేయడం వలన అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ చేతుల మీదుగా రైతులకు ఆర్ డి ఎస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి రాజు, కూటమి నాయకులు భీమ రౌలో, గ్రామస్తులు, ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది, ఐసిఆర్‌పి స్వాతి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఆమదాలవలస : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికు మార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎన్టీ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, లోకేష్ జన్మదిన వేడుకల కేకును కార్యకర్తల మధ్య కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నాయకులు నారా లోకే ష్ జన్మదినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావ డానికి లోకేష్ చేసిన కృషిని అభినందించారు. విద్యా శాఖ మంత్రిగా యువతకి ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యే యంగా మంత్రి లోకేష్ చేస్తున్న కృషిని గుర్తు చేశారు. యువతకు పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహించడం, అంతర్జాతీయ పారిశ్రామిక సద స్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు ఇటీవల దావోస్ లో ఆయన చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయ మన్నారు. కోటికి పైన తెదేపా సభ్యత్వాలు చేసి వారికి భీమా సౌకర్యం కల్పించే కార్యకర్తలకు భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు తమ్మినేని గీత, మొదలవలస రమేష్, ఢిల్లేశ్వర్రావ్, ఉదయ్ కుమార్, వెంకటరమణ, సత్తిరాజు ఎంపీటీసీలు సర్పంచులు యువత పాల్గొన్నారు.

శ్రీకాకుళం టౌన్ : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఏడు రోడ్ల కూడలి నందు, మెగారక్తదాన శిబిరం నిర్వహించి యువతకి స్ఫూర్తిగా నిలిచారు. పలువురు మహిళలకు వస్త్ర దానం చేశారు. కేక్ కట్ చేసి ఆనందంగా మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలను తెదేపా శ్రేణులు జరుపుకున్నారు. తెలుగు తేజాలు స్వర్గీయ ఎన్టీఆర్, ఎర్రన్నల విగ్రహాలకు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి, యువతకు స్ఫూర్తి నారా లోకేష్ జన్మదినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, విద్యాశాఖ మంత్రిగా, యువతకి ఉపాది అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా మంత్రి లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం, అన్ని పాఠశాలలో ఒకేరోజు తల్లిదండ్రుల సమావేశాల నిర్వహించడం, పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహించడం, అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సులో ఆంధ్రప్రదేశ్ కు అనేక పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు ఇటీవల దావోస్ లో ఆయన చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని పేర్కొన్నారు, యువగలం పాదయాత్ర ద్వారా అట్టడుగు వర్గాల సమస్యలను స్వయంగా పరిశీలించి వారి కుటుంబాలలో వెలుగులు నింపడమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్న అవిశ్రాంత కృషివలురు మంత్రి లోకేష్ అని పేర్కొన్నారు. కోటి పైన టీడీపీ సభ్యత్వాలు చేసి వారికి భీమా సౌకర్యం కల్పించడంలో పార్టీ కార్యకర్తల పైన ఉన్న నిబద్ధతకు నిర్వచనం అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ మాట్లాడుతూ టీడీపీ జాతీయ నాయకులు, ఏపీ మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా విద్యా ప్రమాణాల మెరుగుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాలలో యువతకు ప్రాధాన్యతను కల్పించేందుకు నారా లోకేష్ కృషి చేస్తున్నారని, మంత్రిగా తన శాఖలలో సంస్కరణాలు తీసుకొస్తున్నారని తెలిపారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసు నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మంత్రి లోకేష్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షులు మాదాపూర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో తన సమర్థతను తెలియజేస్తున్నారని అన్నారు. పలువురు సీనియర్ తెదేపా నాయకులు మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర అభివృద్ధికి అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం ప్రయత్నిస్తున్న మంత్రి లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు, పలువురు మహిళలు, జిల్లా, శ్రీకాకుళం నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకులు, తెదేపా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

కొత్తూరు : మానవ వనరుల అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఆర్టీజీ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు కొత్తూరులో టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు మాట్లాడుతూ ఎన్.టి.ఆర్ మెమోరియల్ ట్రస్టు లోని హెల్త్ కేర్, విద్య యొక్క ట్రస్టీలలో ఒకరైన నారా లోకేష్ ట్రస్టులో ఆరోగ్యసంరక్షణ కార్యక్రమాన్ని రూపకల్పన చేసాడు. దీనిని పేద ప్రజలు, వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొనుటకు, వారి అవసరాలకు అనుగుణంగా మంచి ఆరోగ్య సేవలను అందించ దానికి ఉపయోగపడే కార్యక్రమంగా రూపొందించారు. ఇది గ్రామీణ, పట్టణ ప్రజలకు చేరువయ్యే కార్యక్రమం.బ్లడ్ బ్యాంకులు, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. యువగళం ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతను భాగస్వామ్యం చేసేందుకు, రాష్ట్ర రాజకీయ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు, నిర్భయంగా తమ గళాన్ని వినిపించేందుకు యువగళం పాదయాత్రను చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో ప్రధాన పాత్ర వహించారనీ టీడీపీ నేత వైస్ ఎంపీపీ లోతుగెడ్డ అన్నారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మి నారాయణ నాయుడు, రేగేటి కన్నయ్య స్వామి, కోయిలాపు సంజీవరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు టీడీపీ నాయకులు,కార్యకర్తలు మొదలగు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తూరు : మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు కొత్తూరు లో ఆ పార్టీ నేతలు ఘనంగా జరిపారు టీడీపీ సీనియర్ నేత మాతల గాంధీ కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమానికి తెలుగుదేశం సీనియర్ నాయకులు మాజీ సహకార బ్యాంకు ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ మాజీ వైస్ ప్రెసిడెంట్ ఆగతముడి మాధవరావు మాజీ మండల పార్టీ అధ్యక్షులు మాతల గాంధీ రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ పోత్రకొండ మోహన్ రావు కుద్దిగాం సర్పంచ్ నెల్లి అచ్యుతరావు హంస సర్పంచ్ మజ్జి వెంకట్రావు కౌసల్యాపురం సర్పంచ్ గనేన గోవిందరావు మాకవరం సర్పంచ్ ప్రతినిధి గార నారాయణ రావు సర్పంచ్ ప్రతినిధి సోమేశ్వరరావు టీడీపీ నేతలు చోడవరపు రాము లోకేశ్వరరావు వెంకటరమణ ముగితి కృష్ణారావు లక్ష్మణరావు ముగితి నారాయణరావు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు అదేవిధంగా పాతపట్నంలో లోకేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

జలుమూరు/పాతపట్నం/హిరమండలం : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఐటీ ఏ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా నియోజకవర్గ కేంద్రం పాతపట్నం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి పాతపట్నం అమ్మవారి గుడి వరకు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. అమ్మను దర్శించి 1001 కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. హాస్పిటల్లో ఉన్న రోగులకు రొట్లు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మామిడి నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల నుండి తెలుగుదేశం అభిమానులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలో స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర విద్య,ఐటీ శాఖ మంత్రి మరియు టిడిపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, యువతకు మంచి భవిష్యత్తు కల్పించాలని కోరారు. విద్యా వ్యవస్థని యువతకు ఉద్యోగాలు నూతన ఆలోచనలతో పార్టీ పేరు ప్రతిష్ఠలను పెంచాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కవిటి : రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, విద్యాశాఖ మంత్రి నారా. లోకేష్ జన్మదినంను ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కవిటి శ్రీ చింతామణి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం కేకులు కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్, బెందాళం తిరుమల కుమార్, ఏ మధు, వజ్జ

రంగారావు, కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రణస్థలం : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కేక్ కట్ చేసి మంత్రి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్ని ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే తాతకు తగ్గ మనవడిగా, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, తన నాయకత్వ ప్రతిభతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న లోకేశ్ బాబును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అటువంటి నాయకుని ప్రోత్సాహం తో మన నియోజకవర్గాన్ని మోడల్ గా చేసుకునేందుకు అందరి సహకారం అవసరమని, కూటమి లోని పార్టీల నాయకులందరూ కలసి కట్టుగా పనిచేద్దామని, అభివృద్ధి దిశగా అడుగులు వేద్దామని రాష్ట్రం మొత్తం ఎచ్చెర్ల ను ఆదర్శంగా తీసుకునేలా దుసుకు పోదామని శ్రేణులకు పిలుపునిచ్చారు.

రణస్థలం... ఘనంగా ఐటీ మంత్రి లోకేష్ పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలో స్టేట్ రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము అధ్యర్యంలో కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రజక సంఘం నాయకులు సోపేటి రామారావు, ధర్మవరపు శంకర్, జొన్నాడ భాస్కర్, దమర్సింగి మహా లచ్చుము, కోస్తి పాపారావు, అప్పన్న, రమణ, సూర్యనారాయణ, లక్ష్మణరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి : ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర - కవిటి : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం కవిటి మండలం శిలగాం పంచాయతీలో రూ.22 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి ఊర్లో సీసీ రోడ్లు పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రోడ్ల మరామత్తులు చేయడం జరుగుతుందని,వచ్చే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి దాసరి రాజు, మాజీ జడ్పీటీసీ బి. రమేష్,జెడ్ ఆర్ యు సి సి సభ్యులు శ్రీనివాసరావు రౌళ్లో, భీమ రౌళ్లో, మణి చంద్రప్రకాష్, టి మోహనరావు, పుల్లట రాజు, సర్వేశ్వరరావు, ప్రణతి, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువులు పరిమితంగా వాడాలి : వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్

విశాలాంధ్ర - కవిటి : రబీ సీజన్లో వరిలో ఎరువులను పరిమితంగా వాడాలని వ్యవ సాయాధికారి బి. దుర్గాప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం బొరివంకలోని వంట పొలా లను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం,కలుపు నివారణ మందుల కోసం వివరించారు. వరిలో ఎకరంకు 75 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ,25 కిలోల పొటాష్ వాడుకోవాలని సూచించారు. అలాగే చివరి దమ్ములో యూరియా 25 కిలోలు, డీఏపీ 50 కిలోలు,పొటాష్ 10 కిలోలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పవన్కుమార్, రైతులు పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో సిఎంఅండ్ ఎంసిఎ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి) విభాగాధి పతులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేష్ తంగుడు, డాక్టర్ పి.రమేష్నాయుడులతో పాటు సిఎస్టి విభాగంలో అసిస్టెంట్ప్రొఫెసర్లుగా ఉన్న ఎస్.కల్యాణ్, పేడాడ ప్రియాంకలు నూతనంగా రచించిన ఎసెన్షియల్ ఆఫ్ పైథాన్ ప్రోగ్రామింగ్ అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిటెక్ కంప్యూటర్స్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకం వల్ల ఎంతో మేలు కలుగుతుందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీని వాసరావు, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది రచయితలను అభినందించారు.

గ్రామ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర - పోలాకి : గ్రామ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలో గురువారం సీసీ రోడ్డు నుండి రాళ్ళపాడు వరకు 50 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారములోకి వచ్చాక నియోజకవర్గంలో అభివృద్ధిపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి గొండు రామన్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణం నాయుడు, మాజీ ఏఎంసి చైర్మన్ బైరి భాస్కర్ రావు, మండల నీటి సంఘం అధ్యక్షులు మిరియాపిల్లి వెంకటప్పలనాయుడు, సూరపు నారాయణదాస్, మండల పార్టీ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు మండల సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చల్లవానిపేట పంచాయతీలో కాలువల పూడికతీతలు

విశాలాంధ్ర - జలుమూరు : మండలం చల్లవానిపేట గ్రామంలో బుధ, గురు వారాల్లో కాలువ పూడికతీత కార్యక్రమాలను చేపట్టారు. పంచాయితీ అధికారులు స్థానిక పంచాయతీ సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. పూడిక తీతలు అనంతరం అంతా ఈ ప్రాంతం నుండి బయటికి తీసుకువెళ్లి పారబోయేటకు సిద్ధం చేస్తున్నామని సచివాలయం సిబ్బంది తెలిపారు.

కారు-బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

విశాలాంధ్ర - ఎల్ఎన్పేట : ఎల్ఎన్పేట, కోవిలాం సమీపంలో అలికాం, బత్తిలి ప్రధాన రహదారిపై గురువారం బైక్-కారు ఢీ కొనడంతో పెద్దకోట గ్రామానికి చెందిన దుద్దు దుర్గారావుకు గాయాలయ్యాయి. బత్తిలి నుంచి నరసన్నపేట వైపు కారు వెళ్తుండగా ఓవర్టచ్ చేయగా ఎదురుగా వస్తున్న బైకును ఢీకొనడంతో బైక్పై ప్రయాణిస్తున్న దుద్దు దుర్గారావుకు గాయాలయి, స్పృహకోల్పోవడంతో వేంటనే రిమ్స్ హాస్పటల్కి తరలించారు.

'టాక్ ది బుక్' కార్యక్రమంలో మాట్లాడనున్న భమిడిపాటి

విశాలాంధ్ర - నరసన్నపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టాక్ ది బుక్ కార్యక్రమంలో రచయిత, గాయత్రి కళాశాల ఆఫ్ సైన్స్, మేనేజ్మెంట్ కళాశాల తెలుగు విభాగాధిపతి, భమిడిపాటి గౌరీశంకర్ ప్రసంగిస్తున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. 24వ తేదీన జరిగే ఈ కార్య క్రమంలో గౌరీశంకర్ డా.వెల్చూరి మురళీధర్ రచన, వాంగ్మయ చరిత్రలో వ్యాస ఘట్టాలు, మరికొన్ని విశేషాంశాలపై ప్రసంగిస్తారని అన్నారు. ఈ సంధర్భంగా గౌరీశంకర్కు గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్, డా.పులఖండం శ్రీనివాసరావు, రచయితల వేదిక అధ్యక్షులు, సదాశివుని కృష్ణ అభినందనలు తెలిపారు.

చత్తీస్ఘడ్లో తెలుగు మహాసభలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పలాస : తెలుగు మహా సంఘం అధ్వర్యంలో మార్చి 8 మరియు 9 తేదీల్లో జరగనున్న ఛత్తీస్ ఘడ్ రాష్ట్రస్థాయి ద్వితీయ తెలుగు మహాసభల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి తెలుగు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని సభలు విజయవంతం చేయాలని సంఘం సభ్యులు పిలుపునిచ్చారు.ఈ మేరకు గురువారం తెలుగు మహా సంఘం నాయకులు భిలాయి సెక్టార్ -9 ఇండియన్ కాఫీ హౌస్ లో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. మార్చి లో తలపెట్టిన రెండు రోజుల తెలుగు మహాసభల్లో ముఖ్య అతిథులుగా ఛత్తీస్గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంస్కృతిక శాఖామాత్యులు కందుల దుర్గేశ్, శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ వి.నిత్యానంద రావు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, శ్రీకాకుళం పార్లమెంటరీ సభ్యుడు,కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, అంతర్జాతీయ తెలుగు కేంద్రం పూర్వ డైరెక్టర్ ఎం మునిరత్నం నాయుడు పాల్గొంటారని, సభలు విజయవంతంగా నిర్వహించడానికి తుది సన్నాహాలు జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ సభల సందర్భంగా విడుదల చేసే సావనీర్ లో మేధావులు, రాజకీయ ప్రముఖుల సందేశాలతో పాటు ఛత్తీస్గఢ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ తెలుగు సంఘాల వివరాలు ప్రచురించడం జరుగుతుందని, సంఘాల ప్రముఖులు తాము నాయకత్వం వహిస్తున్న తెలుగు సంఘం ఆవిర్భావం, ఇతర విశేషాలతో కూడిన వివరాలు, ఫోటోలు ఛత్తీస్ ఘడ్ తెలుగు మహా సంఘం ప్రతినిధులకు ఫిబ్రవరి మొదటి వారంలోగా అందజేయాలని కోరారు. అలాగే సభల్లో పాల్గొనే కవులు, రచయితలు, కళాకారులు ప్రతినిధి ఫారం,ఫోటోతో పాటు తమ ఆర్టికల్స్, రచనలు వీలైనంత త్వరగా పంపించ వలసిందిగా కోరారు.ఈ సమావేశంలో తెలుగు మహా సంఘం అధ్యక్షుడు ఆర్.మురళి, ప్రధాన కార్యదర్శి బి. తులసీ రావు, కోశాధికారి ఎన్. రమణ మూర్తి, కన్వీనర్ రుద్రమూర్తి, సలహాదారుడు ఎం. బాబూరావు, ఉపాధ్యక్షుడు బి గోజోగారావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ గణేష్, కార్యదర్శి సి హెచ్ శ్రీనివాస్,వై భాస్కర్ రావు ప్రభృతులు పాల్గొన్నారు.

రక్తదానంలో పొందూరు టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - పొందూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా గుంవారం ఆమదాలవలస పట్టణంలో ఎంఎల్ ఏ కూన రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పొందూరు మండల టీడీపీ శ్రేణులు భారీగా పాల్గొని రక్తదానం చేశారు. మండలంలో వివిధ గ్రామాలనుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రక్తతదానంచేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలోపొందూరు మండల టీడీపీ నాయకులు చిగిలిపల్లి రామ్మోహన్, అన్నెపు రాము, బలగ శం కరబాస్కర్, సిపాన శ్రీ రంగనాయకులు, చింతాడ వాసుదేవరావ్, అనకాపల్లి చినరంగ, బాడాన శేషగిరి నాయుడు, కే.శ్రీనివాసరావు తదిరులు పాల్గొన్నారు.

జేబీటీ పాఠశాల ఆధ్వర్యంలో ముందస్తు గణతంత్ర దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - జలుమూరు : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సారవకోట మండలం జేబిటి పాఠశాల ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం ముందస్తు గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారతమాత, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, నెహ్రూ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వివిధ వేషా దారులతో అవలింగి బుడితి చీడుపుడి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

స్వాతంత్ర్య సాధనలో నేతాజీ పాత్ర కీలకం

విశాలాంధ్ర - పొందూరు : భారతదేశం స్వాతంత్ర్యం సాధించడంలో అజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు, అతివాది నేతాజీ సుబాష్ చంద్రబోష్ పాత్ర అత్యంత కీలక మని పొందూరు ఎంపీపీ-1 పాఠశాల హెచ్ఎం కె. విజయ కూమార్ అన్నారు. సుబాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించారు. బ్రిటిష్ సైన్యంపై పోరాటం ద్వారా బ్రిటిష్ఫికారులపై ఒత్తిడి తీసుకురాగలిగారన్నారు. స్వాతంత్ర్య సాధనలో గాంధీ పాత్ర ఎంత ఉందో నేతాజీ పాత్ర అంతే ఉందని అన్నారు. నేతాజీ చిత్రపటానికి పూలమా ల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోలుగు కాలనీలో ఏడుగురు పేకాటరాయుళ్ళు అరెస్టు

విశాలాంధ్ర - పొందూరు : మండలం లోలుగుకాలనీలో బుధవారం రాత్రి స్థానిక పోలీసులు పేకాటాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసారు. పోలీస్లకు అం దిన సమాచారం మేరకు సిబ్బందితో ఎస్సై వి. సత్యనారాయణ టాస్కోర్సు పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేశారు. పేకాట్లాడుతున్న ఏడుగురు వ్యక్తులతో పాటు 8 ద్విచక్రవా హనాలు, 7 సెల్ఫోనులు. రూ. 10,080 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయు ళ్లను అరెస్టుచేసి కేసు నమోదుచేశారు.

భరతమాత ముద్దుబిడ్డ సుభాష్ చంద్రబోస్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నగరం లోని ఎల్ ఐ సి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి నేతాజి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించి నేతాజిలాంటి గొప్ప వ్యక్తి కృషి ఫలితంగా స్వాతంత్య ఫలాలు అనుభవిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె శివశంకర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్లో మంచి ర్యాంక్ సాధించి కూడా దానిని విడిచి పెట్టి భారత స్వాతంత్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. అంతేకాకుండా భారత జాతీయ సైన్యమును ఏర్పాటు చేసి తన పిలుపుతో ఎంతోమంది దేశ భక్తులను తన సైన్యంలో చేరేటట్లు చేసి దేశ స్వాతంత్ర్యపోరాటం చేసాడని విద్యార్థినిలకు తెలియజేశారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం మనందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు, ఎన్ ఎస్ ఎస్ పిఓ ఎల్ మోహనరావు, దామోదర రావు, కమల్ కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.



ఎల్ఎన్పేట : లక్ష్మి నర్సుపేట గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ప్రధానోపాధ్యాయుడు.లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్. దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు.సక్షం జిల్లా కన్వీనర్. సామాజిక వేత్త.సీఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ నంబర్. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత.పిపిఎవి మండల గౌరవ అధ్యక్షులు లయన్.డా.ఎం.కె.మిశ్రో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ముందుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి డా.మిశ్రో మరియు సహోపాధ్యాయుడు టి.ఉపేంద్ర లు నివాళులు అర్పించారు.తదుపరి వారు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత విశేషాలు ను వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి విద్యార్థినీలు పాల్గొన్నారు.

మందస : స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు యస్.గణేశ్వర రావు ఆధ్వర్యంలో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాత్యంత్రం తీసుకు రావడంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని తెలిపారు. పాఠశాల ప్రార్ధన సమయంలో స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు సమక్షంలో ఆయనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. భీమారావు, యం.లక్ష్మణరావు, యస్. కిరణ్ కుమార్, యస్.అబ్రహం,వి. రాంబాబు, యం. చిత్రసేను, యం. దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : నేటి యువతకు సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి అని సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, డిజి పురం జెడ్పి హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం లక్ష్మి కాంతమ్, సంతబొమ్మాళి ఎంపియూపీ పాఠశాల హెచ్ ఎం డాక్టర్ రామారావు లు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోరుభద్ర, డిజి పురం, సంతబొమ్మాళి ఎంపీ యూపీ పాఠశాలల్లో గురువారం జరిగాయి. నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అత్యున్నత సివిల్ సర్వీసెస్ ఉద్యోగం ను తృణప్రాయంగా విడిచిపెట్టి, భరత మాత దాస్య శృంఖలాల విముక్తి కోసం బ్రిటిష్ వారితో రాజీలేని పోరాటం చేసిన అగ్రశ్రేణి స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్ర బోస్ అని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి యువత దేశాన్ని పీడిస్తున్న పేదరికం, అవినీతి, స్వార్థం,వివిధ వివక్షతల మీద పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు టి.లోకేశ్వర రావు, తూట భాస్కరరావు, లాకినాన వెంకటరమణ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోంపేట : భారత స్వాతంత్ర సమరయోధుడు, ఇండియన్ ఆర్మీ రూపకర్త నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోంపేట పట్టణంలో నేతాజీ నగర్లో గురువారం సాయంత్రం నేతాజీ విగ్రహం వద్ద స్థానికులు ఘనంగా నివాళులు అర్పించారు.పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించి నేతాజీకి నివాళులు అర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జుత్తు వాసు, తెప్పల రవి, చల్ల సూర్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జింకిభద్ర పాఠశాలలో:
జింకిభద్ర గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జైహింద్ నినాద సృష్టికర్త ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్చంద్రబోస్ జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయుడు బెహరా వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహ దాత చిత్రాడ శ్యామ్సుందర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని నేతాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

టెక్కలి : మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి ఉత్సవాలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గోవిందమ్మ చేతుల మీదుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు. చరిత్ర విభాగ ఇన్చార్జి ఓ. కోటీశ్వరరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సతీష్ కుమార్, ల్యాక్ పాల్, సిఎస్ రావు, ఝాన్సీ రాణి, డాక్టర్ వై వి సి హెచ్ లీలా పద్మజ, శ్రీనివాసులు, తవుడు, సుహారిక, కసవయ్య తదితర అధ్యాపకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టెక్కలి : ప్రతి యువత నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి కణితి కిరణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతమైన మాట్లాడుతూ ప్రతి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆయన సేవలో ఎన్నటికీ మరువలేనని కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర గురించి జనసేనకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు కుమారస్వామి, గవరయ్య, త్రివేణీ రావు, వెంకటరమణ, లక్ష్మణ, గిరి, విశ్వనాథం జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం టౌన్ : భారతీయులను బానిసలుగా చూసిన ఆంగ్లేయులను ఈ దేశం నుండి తరిమికొట్టే దిశగా అడుగులు వేసిన మహోన్నత శిఖరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు లు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం శ్రీకాకుళం లో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరవీరులలో అగ్రగణ్యుడు, అలుపెరుగని పోరాటంతో ఓటమి ఎరుగని వ్యక్తిత్వంతో, మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత నేతాజీ సుభాష్ అని కొనియాడారు. భారత ఆత్మగౌరవ ప్రతీక సుభాస్ చంద్రబోస్ అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సైనికుడు కావడం కోసం సివిల్ సర్వీస్ లో అత్యుత్తమ సర్వీస్ అయిన ఐ పి ఎస్ ను తృణప్రాయంగా విడిచిన కార్యదీక్షపరుడు అని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మీ, తంగుడి నారాయణరావు, గోలీ ఉమామహేశ్వర రావు, గోలీ సంతోష్, వై. మోహన్, గొర్ల వాసుదేవరావు, జామి రాధాకృష్ణ, తిరుపతి రావు, పృథ్వీ రాజ్ పాల్గొన్నారు.

కవిటి : సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుండి తరిమి కొట్టవచ్చునని నమ్మి అది ఆచరణలో పెట్టిన ఘనుడు సుభాష్ చంద్రబోస్ అని ఎం ఎల్ సి నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని లండారిపుట్టుగ సచివాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

బెజ్జిపుట్టుగలో... బెజ్జిపుట్టుగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాష్ చంద్ర బోస్ విగ్రహానికి సోంపేట మండలం వ్యవసాయ అధికారి బొర్ర నరసింహమూర్తి చేతులమీదుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గాంధీజీ యొక్క అహింసా వాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని పోరుబాట కూడా ముఖ్యమని సుభాష్ చంద్రబోస్ భావించారని అన్నారు.బోస్ మరణం నేటికీ మిస్టరీ గానే మిగిలి ఉందని అన్నారు. సుభాష్ చంద్రబోస్ పోరాటానికి గుర్తుగా ఆయన జన్మదినాన్ని పరాక్రమ దివస్ గా ప్రకటించింది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పొందల కృష్ణారావు,పి జానకి రామయ్య, పి ప్రవీణ్, జి తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీజే విద్యాసంస్థలలో... సుభాష్ చంద్ర బోస్ 128 వ జయంతి ఏస్ వి జే ఆవరణంలో ఏస్ వి జే, ఎన్ ఎస్ ఎస్ డిగ్రీ యూనిట్ 1,2 ఎస్ వి జే జూనియర్ కాలేజీ యూనిట్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్ర బోస్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సుభాష్ బోస్ చిత్ర పటానికి పూలతో అలంకరణ చేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం లో ఎస్ వి జె డిగ్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో... ప్రస్తుతం విద్యార్థి దశలో ఉన్న ప్రతి ఒక్క విద్యార్థి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగించి భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో ముందుండేటట్లు చేయాలని ముఖ్య వక్త సంతోష్ అన్నారు. కవిటి మండల కేంద్రము లో గల శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద పాఠశాల ఏవో రాణి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పివైజి పుట్టుగలో... మండలంలోని పివైజి పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ విద్యార్థులు గ్రామస్తులు పూలమాలలు నివాళులు అర్పించారు.

ముత్యాలపేటలో... అజాద్ హింద్ ఫౌజు దళపతిగా భారతదేశానికి స్వేచ్ఛ వాయువులు ప్రసాదించడానికి నిరుపమాన సేవలు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు ప్రతితరము గుర్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆనింగి నాగేశ్వరరావు అన్నారు. ముత్యాలపేట పాఠశాల ప్రాంగణంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, విద్యార్థులకు నేతాజీ జీవిత చరిత్ర గురించి సంక్షిప్తంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కింజరాపు రామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ కృష్ణ, అప్పలరాజు, సింహాచలం, నాగమణి, మొర్రి గోపి పాల్గొన్నారు.

టెక్కలి : మండల కేంద్రంలో స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ముందుగా గ్రంథాలయ అధికారిని రూపవతి చేతుల మీదుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు. పాఠకులు ప్రతి ఒక్కరూ నేతాజీనీ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. సుభాష్ చంద్రబోస్ నేతాజీ జీవిత చరిత్ర గురించి పాఠకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు తదితరులు పాల్గొన్నారు.